

# అనుమానం

ఎస్సెస్సార్వై. శర్మ

ఆదివారంపూట తీరికగా ఈజీచైరులో కూర్చుని పేపరు చదువుకుంటు న్నాను. పక్కనే అయిదేళ్ల నానిగాడు తన బొమ్మలతో ఆటలాడుతూ, ఏవో కబుర్లు చెబుతున్నాడు. నేను మధ్యమధ్య పరధ్యాన్నంగా వింటూ, వూఁ కొడు తున్నాను. శ్రీమతి ఇంట్లో ఎక్కడో పనిలో వున్నట్టుంది.

నానిగాడు నాగడ్డం పట్టుకుని తన వైపు తిప్పుకుంటుంటే పేపర్లోంచి ఈ లోకంలోకి వచ్చిపడ్డాను.

"నాన్నా! మరీ......ఇంకో నాన్న ఏడీ?"

ఉలిక్కిపడ్డాను ఎవరు ఈ ఇంకో నాన్న?

''ఎవరమ్మా అది? ఇంకో నాన్నంటే ఎవరూ? బుజ్జగించాను"

''ఊఁ! ఇంకో నాన్న!'' నిర్ధారణ చేశాడు చిరంజీవి

నా కర్థంకాలేదు. ఒకవేళ నేను ఆఫీసుకి వెళ్ళిన సమయంలో ఎవరైనా ఇంటికివస్తే తెలియక నేననుకున్నాడేమో పిచ్చివెధవ.

"ఎక్కడున్నాడురా నాని, ఇంకో నాన్న?"

'ఇంకోనాన్ననా? హాల్లోవున్నాడు."

"ఎప్పుడురా."

"నిన్న."

మా నానిగాడు అన్నిటికీ నిన్న అనే అంటాడు కాని, ఇంకో నాన్నేమిటి? హాల్లో వుండటమేమిటి? వెధవ అనుమానం ఒకటి మొదలయింది.

"ఇంకో నాన్న హాల్లో ఏంచేశాడురా?"

"ఇంకో నాన్న...కుర్చీలో కూర్చున్నాడు."

సరి. బాగానే వుంది. అంటే నేను లేనప్పుడు ఎవడో ఇంటికి వచ్చాడన్నమాట. ఎవరైవుంటారు చెప్మా ?

"ఇంకా ఎవరు వున్నారమ్మా హాల్లో?" ఇంకా సహనంగానే ప్రశ్నించాను.

"ఊఁ! ఇంకోనాన్నా...అమ్మా... హాల్లో...కుర్చీలో...కూర్చున్నారు."

ఇంక సహనం నశించిపోయింది. ఎంతయినా అయిదేళ్ళ పసివాడు అబద్ధం చెప్పడు గదా! ఈ సంగతేదో ఇంతటితో తేల్చకపోతే కష్టం.

శ్రీమతిని పిలిచాను.

"ఏమిటండీ అది! ఏం మునిగిపోయిందని అంత బిగ్గరగా కేకలు వేస్తున్నారు? ఏం జరిగిందేమిటి అసలు?"

"ఇంకా జరిగేదేమిటి? నీ బొంద? నేను ఆఫీసు కెళ్ళినప్పుడు నువ్వు ఏం చేశావు? నిన్న ఎవరొచ్చారు ఈ ఇంటికి, నేను లేనిసమయంలో?"

"రామ రామ! ఏంచేయటమేమిటండీ. వంటచేస్తున్నాను. బాబిగాడికి నీళ్ళు పోశాను. బట్టలుతికాను..."

"చాల్లే. పసివాడు అబద్ధాలాడతాడనా? నిజం చెప్పేయ్ అసలు ఎవరొచ్చారు ఈ ఇంటికి?" అని శ్రీమతిని గద్దించాను.

నా అరుపులకు భయపడి బాబిగాడు ఏడుపు లంకించుకున్నాడు పెద్దగా.

"చెప్పరా నానీ! నిన్న ఎవర్రా ఇంటికి వచ్చింది?" అని వాళ్ళ అమ్మ వాణ్ణి హాల్లోకి తీసుకుపోయింది. నేనూ హాల్లోకిపోయి, "ఊఁ! ఇప్పుడుచెప్పరా! ఇంకో నాన్న ఎక్కడ కూచున్నాడు?" నిజం రాబట్టాలని కాస్త నిదానంగానే అడిగాను.

"అదిగో ...అక్కడ...!" ఏడుస్తూనే చూపుడు వేలితో చూపించాడు.

అవును, అక్కడ వాడి అమ్మానాన్నా కుర్చీలో కూర్చుని తీయించుకున్న పెద్ద ఫోటో గోడకి తగిలించి వుంది.

